# సర్‌తో ప్రజాస్వామ్యానికి పెనుముప్పు

- ఊరూ పేరు లేకుండా పోతున్న 30లక్షల ఓట్లు
- గడువును అక్టోబర్ వరకు పొడిగించాలి
- ఆధార్, పాస్‌పోర్టు చెల్లవనడం దారుణం
- సిఇఒ వివేక్ యాదవ్‌ను కలసి 13డిమాండ్లతో వినతిపత్రం ఇచ్చిన 'ఓటు పరిరక్షణ కమిటీ'

**సచివాలయం,సెప్టెంబర్ 15,ప్రభాతవార్త :** ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు,కానీ ప్రస్తుతం రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరిట జరుగుతున్న ప్రక్రియ ఓటర్ల నమోదు కోసం కాకుండా,ఓట్లను ఏకపక్షంగా ఎత్తివేసేందుకు జరుగుతున్న కుట్రలా ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజువారి కూలీలు,నిరుపేదలు,మైనార్టీలు,గిరిజనులు ఉపాధి కోసం పొరుగు ప్రాంతాలకు వెళ్ళిన దాదాపు 30లక్షల మంది అర్హులైన పౌరులు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఓటు పరిరక్షణ కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ తీవ్రమైన అంశంపై మంగళవారం సచివాలయంలో ఏపి ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌ను ఓటు పరిరక్షణ కమిటీ కన్వీనర్,అడ్వకేట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీల, పౌర సంఘాల ప్రతినిధుల బృందం నేరుగా కలిసింది. ఈ బృందంలో రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎ.బి.వేంకటేశ్వరరావు,రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసరావు,సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య,మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు,వైసీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు,సిపిఐ(ఎం) నాయకుడు వి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ ప్రతినిధి కె.శివాజీ,డిబిఎస్ నేత వినయ్ కుమార్‌తో సహా పలువురు నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల తొలగింపును నిరసిస్తూ 13కీలక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసీ ముందు ఉంచిన ఓటు పరిరక్షణ కమిటీ డిమాండ్లు,ఓటు నమోదు, సవరణల ప్రక్రియ గడువును సెప్టెంబర్ ఆఖరు, అక్టోబర్ వరకు పొడిగించాలని బృందం డిమాండ్ చేసింది. 18ఏళ్ళు నిండిన అర్హులందరికీ ఓటు కల్పించేలా ప్రత్యేకంగా ఇంటింటి క్యాంపెయిన్ చేపట్టాలని,దరఖాస్తుదారులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని కోరింది. రాష్ట్రంలో ఉన్న 22.3లక్షల మంది వలస కార్మికులకు ఓటు హక్కు భంగం కలగకుండా చూడాలని,దూర ప్రాంతాల్లో ఉన్న వారి కోసం విచారణను వీడియో కాల్ ద్వారా నిర్వహించాలని స్పష్టంచేసింది.



**పాస్‌పోర్టు,ఆధార్ ఉన్నా ఓటు ఇవ్వరా? ... సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య డిమాండ్**

రాష్ట్రంలో సర్ ప్రక్రియ ద్వారా అర్హులైన అనేకమంది పౌరులు తమ ప్రాథమిక ఓటుహక్కును కోల్పోవడం అత్యంత దారుణమని,తప్పుల తడకగా మారిన ఈ పద్ధతిని పక్కనబెట్టి ఓటు కోల్పోయిన ప్రతి ఒక్కరికి తక్షణమే మళ్ళీ నమోదు కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**ఆధార్ చెల్లకపోతే అది నాలుక గీసుకోవడానికి?: ఏ.బి.వెంకటేశ్వరరావు (రిటైర్డ్ ఐపిఎస్)**

రాష్ట్రంలో 22లక్షల అన్‌ట్రేసబుల్,మరో 7లక్షల అన్‌మ్యాప్డ్ కలిపి 30లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేశారని మండిపడ్డారు. వయస్సు, చిరునామా ధృవీకరణ కోసం ఇచ్చిన ఆధార్ కార్డు చెల్లదనడం దారుణమని,అలాంటప్పుడు ఆ కార్డు ఉన్నది నాలుక గీసుకోవడానికా అని ప్రశ్నించారు. పోలీస్ ఇంటెలిజన్స్ విచారణ చేసి ఇచ్చే పాస్‌పోర్టు కూడా పనికిరాదనడం ఆశ్చర్యకరమన్నారు. ఎన్నికల కమీషన్ కేంద్ర ప్రభుత్వ తోలుబొమ్మలా మారకూడదని,సుప్రీంకోర్టు లేదా హైకోర్టు వెంటనే జోక్యం చేసుకొని ఈ 30లక్షల ఓట్లపై సుమోటోగా కేసు విచారించాలని కోరారు.

**సాంకేతిక సమస్యల విపరీతం బండ్ల శ్రీనివాసరావు (రిటైర్డ్ ఐఏఎస్), కె.శివాజీ (కాంగ్రెస్)**

గిరిజన,కొండ ప్రాంతాల్లో సర్వర్లు డౌన్ అయి ప్రజలు నమోదు చేసుకోలేకపోతున్నారని వివరించారు. 30లక్షల ఓట్లు గల్లంతవుతున్న అంశంపై సీఈవో చాలా పాజిటివ్‌గా స్పందించారని,తమ యంత్రాంగాన్ని సమాయత్తం చేసి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు.

# చెత్తకుంభకోణంలో 1200 కోట్ల అవినీతి

- ఈ అంశంపై మంత్రి నారాయణ దాటవేత దోరణి
- సమాధానం చెప్పలేక వైకాపాపై అబద్దాలతో నిందలు
- దమ్ముంటే కూమటి ప్రభుత్వం తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి
- చెత్తకుంభకోణంపై సిబిఐ విచారణ చేపట్టాలి
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్




**నెల్లూరు,సెప్టెంబరు15 ప్రభాతవార్త-విద్య:** చెత్తపేరుతో మంత్రి నారాయణ రూ.1200 కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడారని,ఇందుకు సంబంధించి తమ వద్ద పూర్తి ఆదారాలు ఉన్నాయని వైకాపా నెల్లూరు నగర నియోజకవర్గఇన్‌చార్జ్, తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక పొదలకూరురోడ్డులోని వైకాపా జిల్లా ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతు చెత్త కుంబకోణంపై తాము పూర్తి ఆధారాలతో ప్రశ్నిస్తే మంత్రి నారాయణకు చీమకుట్టినట్టైన్నా లేదని దుయ్యబట్టారు. దీనిపై స్పందించాల్సిన మంత్రి నారాయణ దాటవేత దోరణి అవలంబించటం సిగ్గుచేటన్నారు. ఈ అవినీతిపై తాము పూర్తి ఆధారాలతో బహిరంగ చర్చకు వస్తామంటే మంత్రి నారాయణ తాము , తమ పిల్లలు పూర్తిగా సెటిల్ అయ్యారని, మాకు అవినీతికి పాల్పడాల్సిన అవసరం లేదని , 1200 కోట్లు కాదు 1190 కోట్లు అని చెప్పడం పొంతన లేని సమాదాలను వెల్లడించటం చూస్తుంటే బుకాయించినట్లుగా ఉందన్నారు. దేశం నాయకులు చెత్త వేస్ట్ నుండి 1190 కోట్లు అని చెబుతున్నారని, అయితే ప్రస్తుత చెత్తప్లాంట్స్ , ప్రాసెసింగ్ యూనిట్స అంతా చూస్తుంటే మరో రెండువేల కోట్లు అవినీతి బయటపడేలా ఉందన్నారు. అవినీతి ఆధారాలు పూర్తిగా తమ వద్ద ఉన్నాయన్నారు. మాట కొస్తే తమ వైకాపా ప్రభుత్వ హయాంలో 85లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిందని,ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణలు చెబుతున్నారని, ప్రస్తుతం 163లక్షల టన్నుల చెత్తను పెంచుకుంటూ పోయింది కూటమి ప్రభుత్వ ఒకాదా అని ప్రశ్నించారు. దేశం నేతలకు దమ్ము, ధైర్యం ఉంటే తాము అడిగిన 12 ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, సమాధానం చెప్పలేక మంత్రి నారాయణ మోఖం చాటేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ చెత్త కుంబకోణంపై తక్షణం సిబిఐ విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మంత్రి నారాయణ గతంలో చేసిన అనేక పన్నుల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. విఆర్ హైస్కూల్ పేరుతో రూ.10 కోట్ల రూపాయల కార్పోరేషన్ నగదు మాయం చేసేందుకు ప్రణాళిక రచించారని, తాము పని గట్టే సరికి వెనుకంజ వేసి సిఎస్ఆర్ నిధులు అని మాట మార్చారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.8500 కోట్ల నిధులతో 38వేల ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ది చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని మూలన వేసిందన్నారు. వీఆర్ హైస్కూల్ అంశంలో అవినీతి జరిగిందా లేదా అని మంత్రి నారాయణ వివరించాలన్నారు. దీనిపై అనేక మార్లు కార్పోరేషన్ కమిషనర్‌ను ప్రశ్నించినా ఫలితం లేదన్నారు. అలాగే చెట్లు నాటే కార్యక్రమంలో ఒక్కో చెట్టుకు రూ.12000 కాజేసేందుకు కుట్ర జరుగలేదా అని ప్రశ్నించారు. చెట్లు నాటేందుకు రూ.5000 , వాటిని నిర్వహన కోసం మరో 7000 అనుమతులు తీసుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. ఈమేరకు ఈ సంవత్సరం ఫిబ్రవరిలో 7న జరిగిన సర్వసభ్య సమావేశంలో అనుమతులు తీసుకోలేదా అని తెలియజేయ్యాలన్నారు. దోచుకుతినటానికి సిద్దమైన వారు పిట్టకథలు చెప్పటం హాస్యాస్పద మన్నారు. అనంతరం కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతు చెత్త అవినీతి కుంబకోణంపై మంత్రి నారాయణ బహిరంగ చర్చకు రావాలని తాము పిలిస్తే మంత్రి మాత్రం అర్థం పర్థం లేకుండా దాటవేత దోరణి అవలంబిస్తున్నారని, ఈ అవినీతిపై వెంటనే సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు ఇంజెక్షన్లు విక్రయిస్తున్న ఆర్‌ఎంపి డాక్టర్ అరెస్ట్



**జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు15, (ప్రభాతవార్త):** ఎలాంటి బిల్లులు, ప్రిస్క్రిప్షన్లు లేకుండా ట్రామడాల్ మత్తు ఇంజెక్షన్లను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఆర్ ఎంపీ డాక్టర్ పగిల్ల నాగేంద్రకుమార్‌ను ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్ట్ చేశారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ బి.హెచ్. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సీఐ ఎం.వి. సుభాష్, ఎస్సై ఎన్. వీరప్రసాద్ ఆధ్వర్యంలోని పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. గతంలో మెడికల్ ఏజెన్సీ యజమానుల అరెస్ట్‌కు సంబంధించి నమోదైన ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసు దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు కుక్కునూరు మండలం కివ్వాక గ్రామానికి చెందిన నాగేంద్రకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 73 ట్రామడాల్ మత్తు ఇంజెక్షన్ అంప్యూల్స్, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

- ప్రజాప్రతినిధుల సమన్వయంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

**అనంతపురం క్రైమ్ సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** త్వరలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ ఐక్యంగా కలిసి పార్టీ గెలుపుకు కృషి చేద్దామని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలోని ఆయన నివాసంలో జిల్లా ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జిల్లాకు సంబంధించిన అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలు, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై ప్రజాప్రతినిధులతో ఆత్మీయంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి టి.జి. భరత్, ప్రభుత్వ విప్ రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, స్థానిక సంస్థల ఎన్నికల అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జ్ యేసు ప్రతాప్ రెడ్డి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, తదితరులు హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. జిల్లా ప్రజాప్రతినిధుల మధ్య ఆత్మీయత, పరస్పర సహకారం, సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే విధంగా కొనసాగింది. అనంతపురం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.



## హత్య కేసులో ముద్దాయిలుకి ఏడు యేళ్లు జైలు శిక్ష

**గూడూరు (నెల్లూరు), సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** బాలాయపల్లి మండల పరిధిలోని హస్త కావేరి గ్రామంలో 2013 మే 14వ తేదీన జరిగిన హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలకు ఏడు ఏళ్లు జైలు శిక్ష, ఐదు వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఏడోవ అదనపు జిల్లా జడ్జి తీర్పు నిచ్చారు. ఈ హత్య కేసులో మొత్తం పది మంది ముద్దాయిలు ఉండగా వారిలో ముగ్గురు మరణించగా, ఒకరు పరారీలో ఉన్నారు. ఆరుగురు ముద్దాయిల్లో ఏ2 కొమ్మల మాతయ్య, ఏ3 పారిచర్ల బాబ్జాన్ బాబ్జీలకు ఏడు ఏళ్లు జైలు శిక్ష, ఐదు వేలు చొప్పున జరిమానా విధించారన్నారు. బాధితుల పక్షాన ఏపీ పి. వసంత కుమార్ వాదనలు వినిపించి ముద్దాయిలకు శిక్ష పడేలా చేశారు.

# ఆళ్ల నాని మృతి పట్ల ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి


**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఆళ్ల నాని మృతిపై సంతాపం తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని(కాళీ కృష్ణ శ్రీనివాస్) హఠాన్మరణం నాకు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. 56 సంవత్సరాల వయసులోనే గుండెపోటుతో దూరమవ్వడం బాధాకరం. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. ఆళ్ల నాని ఆత్మకు శాంతిని చేకూర్చాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నాను అంటూ ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు.

**ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా - డిసిఎం పవన్ కల్యాణ్**

రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో దిగ్భ్రంతి వ్యక్తం చేశారు. ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆళ్లనాని ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానంటూ పవన్ సంతాపం వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే ఆకస్మికంగా మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి లోను చేసిందన్నారు.

**ఆళ్ల నాని మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి లోకేశ్**

"టీడీపీ నేత, మాజీ మంత్రి, ఆళ్ల నాని గుండెపోటుతో మృతి చెందారనే సమాచారం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ "ఎక్స్" వేదికలో పేర్కొన్నారు. వివాదాలకు దూరంగా, అందరితోనూ స్నేహపూర్వకంగా మెలిగే నాని గారి స్మృతిలో నివాళులర్పిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తున్నాను,ఆయన ఆత్మశాంతి కలుగాలని కోరుకుంటున్నానన్నారు.



**ఎపికి ఏలేటి నాని చేసిన సేవలు చిరస్మరణీయం - విజయసాయి రెడ్డి**

మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని మృతిపట్ల మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఎక్స్ వేదికగా సంతాపం తెలియజేశారు. ఆళ్ల నాని రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ విజయసాయి రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్లనాని ఆకస్మిక మృతిపై వైయస్.జగన్ దిగ్భ్రాంతి,**

మాజీ డిప్యూటీ సీఎం, ఏలూరు మాజీ శాసనసభ్యుడు, టీడీపీ నాయకుడు ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మృతిపట్ల మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన మృతి తనను కలచివేసిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాల్సిందిగా దేవుడ్ని ప్రార్థిస్తున్నానన్నారు. వైయస్సార్‌సీపీ హయాంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఆళ్లనాని పనిచేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువతులు మృతి

- ఇద్దరు యువకులకు గాయాలు

**బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** బుక్కరాయసముద్రం మండల పరిదిలోని రోటరీపురం గ్రామంలో మంగళవారం తెల్లవారుఝామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువతులు మృతి, ఇద్దరు యువకులకు గాయలైనట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. వారు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి నుండి అనంతపురం వస్తున్న టాటాసఫారీ వాహనం రోటరీపురం గ్రామంలోని హోటల్ లోకి దూసుకెల్లి యాక్సిడెంట్ కావడం జరిగింది. యాక్సిడెంట్ జరిగిన సమయంలో హారిత అనే మహిళ అక్కడికి అక్కడే మృతిచెందినది, ఆ వాహనంలో మృతిచెందిన అమ్మాయితోపాటు వినయ్ కుమార్, శ్రీధర్‌రెడ్డి, నివేదిత అనే వారుకూడ అందులో ప్రయాణిస్తున్నారు.





వారికి గాయాలు కావడంతో వారిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నివేదిత అనే మహిళ కూడ మృతి చెందినది. డ్రైవర్ శ్రీధర్‌రెడ్డి కి గాయాలు కావడం జరిగింది. వినయ్ కుమార్ ఒక ఇన్స్‌రెన్స్ కంపెనిలో విధులు నిర్వహిస్తున్నాడు ఇద్దరు మహిళలు ఒక ప్రవేట్ ఆసుపత్రిలో నర్సులుగా పనిచేస్తున్నారు. ఈ నలుగురు సలకంచెర్వు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. నిద్దర ముత్తులోనా లేక మద్యం సేవించినారా అనేవిషయాలపై డాక్టర్ ఇచ్చే నివేదిక పై దర్యాప్తు చేస్తామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

## అమరావతి జెఎసి సభ్యులు ధనేకుల రామారావు మృతిపట్ల సిఎం సంతాపం..

**అమరావతి, సెప్టెంబర్ 15,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి జేఏసీ సభ్యులు ధనేకుల రామారావు అనారోగ్యంతో మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. అమరావతి ఉద్యమం ప్రారంభం నుంచి రామారావు చురుగ్గా పాల్గొన్నారని, రాజధాని కోసం చేసిన పోరాటంలో గత ప్రభుత్వ అక్రమ కేసుల్లో జైలుకు కూడా వెళ్లారని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. రామారావు లాంటి వ్యక్తుల పోరాటంతోనే రాజధాని నిలబడిందని వ్యాఖ్యానించారు. ధనేకుల రామారావు ఆత్మకు శాంతి చేకూరాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## సమ్మెకు సిద్ధమైన పవర్ జెఎసి

- చర్చలు జరిపి పక్షం రోజులు దాటినా స్పందన లేకపోవడం
- వారం రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త:** విద్యుత్ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై యాజమాన్యంతో చర్చలు జరిగి పదిహేను రోజులు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంపై పవర్ జేఏసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈమేరకు మంగళవారం మింట్‌కాంపౌడ్‌లోని 1104 కార్యాలయంలో జెఏసీ చైర్మన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్,జనరల్ సెక్రటరీ శ్రీధర్‌లతోపాటు జెఏసీ సభ్యులంతా అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ తాము సిఎండీలతో చర్చించి పక్షం రోజులు దాటినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈనిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉద్యోగులందరూ సమ్మెకు సిద్ధం కావాలని డిమాండ్ల పరిష్కారానికి కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పవర్ ఎంప్లాయీస్ జెఏసీ, ఆర్టీసీన్ జెఏసీ, పెన్షనర్ జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దేవాలయాల దొంగలు అరెస్ట్

- ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని దేవాలయాలే టార్గెట్
- రూ.40 లక్షల విలువైన 21 కిలోల వెండి ఆభరణాలు, వెండి ముద్దలు, ద్విచక్ర వాహనం స్వాధీనం

**అనంతపురం క్రైమ్ సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని భక్తుల మనోభావాలతో చెలగాటమాడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటను అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ పోలీసులు చాకచక్యంగా కట్టించారు. ముఖాలకు మాస్కులు, చేతులకు గ్లౌజులు ధరించి... సీసీ కెమెరాలపై రంగులు స్ప్రే చేస్తూ పవిత్ర ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర నేరస్థులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 40 లక్షల విలువ చేసే 21 కిలోల వెండి ఆభరణాలు, కరిగించిన వెండి ముద్దలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్ కేసు వివరాలను వెల్లడించారు.

అరెస్టయిన నిందితుల వివరాలు : కురపాటి సాయి కుమార్, నందమూరి నగర్, భాగ్యనగర్ ఒకటో క్రాస్, అనంతపురం. కనుముక్కల చాంద్ బాషా, అక్కంపల్లి గ్రామం, అనంతపురం రూరల్ మండలం. గుండప్పగారి సూదం కొడిగెనెక్హళ్లి, పరిగి మండలం, శ్రీ సత్య సాయి జిల్లా. ముఠా నేపథ్యం :అరెస్టయిన ఈ ముఠాలో కురపాటి సాయికుమార్ , కనుముక్కల చాంద్ బాషాలు ఇద్దరూ మంచి స్నేహితులు. వృత్తిరీత్యా సాయికుమార్ వాహనాల సర్వీసింగ్ సెంటర్‌లో పని చేసేవాడు. చాంద్ బాషా టైల్స్ పరిచే కూలీ పనులకు వెళ్లేవాడు. ఈ ఇద్దరికి కూలీ పనుల వల్ల వచ్చే ఆదాయం వీరికున్న వ్యసనాలకు సరిపోయేవి కాదు. సులువుగా సంపాదించాలని భావించి దేవాలయాలను టార్గెట్ చేసుకున్నారు. గత ఏడాది కాలంలో ఈ ఇద్దరూ కలిసి ఇదివరకే చెరో ఆరు కేసులు... గుండప్పగారి సూదం జతయ్యాక తాజాగా ముగ్గురు కలిసి ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లోని దేవాలయాలలో 9 దొంగతనాలకు పాల్పడ్డారు. సీసీ కెమెరాల్లో దృశ్యాలు పడకుండా స్ప్రేయర్ ద్వారా లెన్స్‌ను బ్లర్ చేయడం, లేదా ఏకంగా డీవీఆర్‌లనే ఎత్తుకెళ్లడం వీరి నేరశైలి. దేవతా విగ్రహాలకు అలంకరించిన వెండి ఆభరణాలు, ప్రతిమలను సులువుగా ఎత్తుకెళ్లి కరిగించి విక్రయించేవారు. చాకచక్యంగా ఛేదించిన కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ పోలీసులు కంబదూరు పరిధిలోని రాంపురం మారెమ్మ ఆలయంలో సీసీ కెమెరాలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడిన ఘటనపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో ఈ ముఠాను అదుపులోకి తీసుకుని విచారించగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రస్తుతం కంబదూరు, బ్రహ్మసముద్రం, శెట్టూరు, పామిడి, బుక్కరాయసముద్రం, రామగిరి నసనకోట ముత్యాలమ్మ ఆలయం, రొద్దంలతో పాటు కర్ణాటకలోని తుమకూరు జిల్లా కొరటగెరె, క్యాసంద్ర పరిధుల్లో జరిగిన 9 చోరీ కేసులను కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు ఛేదించారు. ఈ ముఠాలోని కురపాటి సాయికుమార్, కనుముక్కల చాంద్ బాషాలపై గతంలో జరిగిన సింగనమల పరిధిలో 2 కేసులు, నార్పల, అనంతపురం రూరల్, గార్లదిన్నె, బీకేఎస్ పరిధుల్లో ఒక్కో కేసు చొప్పున మొత్తం 6 పాత కేసులు ఉన్నాయి. మూడవ నిందితుడైన గుండప్పగారి సూదంపైన కూడా బాడిలీ అఫెన్స్ , తదితర పాత కేసులున్నాయి. అరెస్ట్ ఇలా : దేవాలయాల దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచాలనే జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో కళ్యాణదుర్గం రూరల్ సి.ఐ నీలకంఠ, కంబదూరు ఎస్సై లోకేష్ , ఏఎస్సై గంగాధర్ , కానిస్టేబుళ్లు ఖాజా, మహేష్, ప్రసాద్ , మోహన్ కృష్ణ, రామానాయుడు, హరీష్‌లు ప్రత్యేక బృందంగా ఏర్పడి పక్కా సమాచారంతో ఈరోజు కంబదూరు చెక్ పోస్ట్ ఈ ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. "దేవాలయాల భద్రతకు, ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు భంగం కలిగిస్తే ఎంతటి ముఠాలైనా చట్టం ముందు తలవంచాల్సిందే. పవిత్ర స్థలాల్లో చోరీలను సహించేది లేదు" అని ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు. చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.




## అర్జీల పరిష్కారంలో కలెక్టర్ నాగరాణి ప్రత్యేక చొరవ

- అర్జీదారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారాలపై ఆరా

**భీమవరం, సెప్టెంబరు15, (ప్రభాతవార్త):** ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేక చొరవ ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి అర్జీలు సమర్పించిన జిల్లాకు చెందిన 14 మంది అర్జీదారులతో మంగళవారం ఆమె చరవాణిలో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. అర్జీలపై అధికారులు తీసుకున్న చర్యలను, సమస్యలు పరిష్కారమైన తీరును అడిగి తెలుసుకున్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్పకు చెందిన వర్ధనపు సుబ్బలక్ష్మి భూ వివాదంలో కక్షిదారుల బెదిరింపులపై రక్షణ కోరగా, కలెక్టర్ ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేసి బైండోవర్ చేయడంతో సమస్య పరిష్కారమైంది. దీంతో సుబ్బలక్ష్మి కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భీమవరం 1వ వార్డుకు చెందిన మలపాక శరత్‌చంద్రకు కోవిడ్ సమయంలో వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.10 లక్షలు మంజూరయ్యాయి. దీనిపై ఆయన కలెక్టర్‌తో మాట్లాడి ధన్యవాదాలు తెలిపారు. వీరవాసరం మండలం నవుదూరుకు చెందిన పి.విఘ్నేశ్వరరావు భూ వివాదంలో బెదిరింపులపై చేసిన ఫిర్యాదుకు స్పందించిన అధికారులు కేసు నమోదు చేసి బైండోవర్ చేశారు. వీరవాసరం గ్రామానికి చెందిన పీతల కాంతరత్నం కోరిన మేరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను యథాస్థానంలో కొనసాగించేలా చర్యలు తీసుకున్నారు. భీమవరం 1వ వార్డుకు చెందిన సిహెచ్. రాజాకుమార్ తిరిగి విధుల్లో కొనసాగించాలన్న అర్జీపై స్పందించి, అనుమతుల కోసం సర్వశిక్ష అభియాన్‌కు నివేదిక పంపారు. ప్రతి అర్జీని బాధ్యతగా స్వీకరించి, పరిష్కారం జరిగే వరకు పర్యవేక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి.. సమస్య పరిష్కారమైన అనంతరం అర్జీదారులతో స్వయంగా మాట్లాడి వారి సంతృప్తిని తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి వై. దోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధీరజ్ బొమ్మదేవరకు మంత్రి లోకేశ్ ప్రశంసలు

**అమరావతి,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** మెక్సికోలోని సాల్టిల్లో వేదికగా జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ ఫైనల్ 2026లో చరిత్రాత్మక విజయం సాధించిన భారత ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవరను ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అభినందించారు. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తొలి భారతీయ ఆర్చర్‌గా ధీరజ్ రికార్డు సృష్టించడం దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా ధీరజ్ విజయంతో ఆంధ్రప్రదేశ్ క్రీడా కీర్తి మరింత ఇనుమడించిందని అన్నారు. అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో పాటు కఠోర సాధన ఫలితంగానే ఈ అద్భుతమైన విజయం సాధ్యమైందని కొనియాడారు. భవిష్యత్తులో ధీరజ్ మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి దేశ కీర్తిని మరింత పెంచాలని నారా లోకేశ్ ఆకాంక్షించారు.

**ఉమెన్స్ ఆసియా కప్ (టీ20) టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత మహిళల క్రికెట్ జట్టుకు నారా లోకేశ్ అభినందనలు**


2026 వరల్డ్ ఉమెన్స్ ఆసియా కప్ (టీ20) టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత మహిళల క్రికెట్ జట్టుకు నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఫైనల్‌లో అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించి ఎనిమిదోసారి విజేతగా నిలవడం భారత మహిళల క్రికెట్ జట్టు ప్రతిభకు నిదర్శనమన్నారు. ఈ విజయానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీ చరణి కీలకంగా నిలిచారని, అద్భుతమైన బౌలింగ్‌తో నాలుగు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించారని ప్రశంసించారు. బృందస్ఫూర్తి, సమష్టి కృషితో భారత జట్టు సాధించిన ఈ విజయం యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని నారా లోకేశ్ పేర్కొన్నారు.

**ప్రపంచ రికార్డును నెలకొల్పిన పారా స్విమ్మర్ బలగ గణేశ్‌ను అభినందించిన లోకేష్**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పారా స్విమ్మర్ బలగ గణేశ్ అరుదైన ప్రపంచ రికార్డును నెలకొల్పి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. జర్మనీ నుంచి స్విట్జర్లాండ్ వరకు విస్తరించి ఉన్న 12 కిలోమీటర్ల బోడెన్సీ సరస్సును వెట్‌సూట్ లేకుండా ఈది, ఈ ఘనత సాధించిన అత్యంత వేగవంతమైన పారా స్విమ్మర్‌గా చరిత్ర సృష్టించారని వివరించారు. ఈ మేరకు నారా లోకేశ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. గణేశ్ ఈ దూరాన్ని కేవలం 5 గంటల 14 నిమిషాల 13 సెకన్లలో పూర్తి చేశారని, దీనితో జర్మనీకి చెందిన స్వెన్ ఎకార్డ్ పేరిట ఉన్న 5 గంటల 33 నిమిషాల రికార్డు బద్దలైందని లోకేశ్ తన పోస్టులో వెల్లడించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ 2025లో గణేశ్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారని లోకేశ్ తెలిపారు. ఈ అసాధారణ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. "మా ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో టీచర్‌గా ఎంపికైన గణేశ్ మాస్టారు పారా స్విమ్మింగ్ వరల్డ్ రికార్డు నెలకొల్పడం మనందరికీ గర్వకారణం" అని ఆయన ప్రశంసించారు. ఈ మేరకు గణేశ్ ఘనతకు సంబంధించిన వీడియోను లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.

# జై గణేశ, జైజై గణేశా

• రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



**విజయవాడ,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వినాయక చవితి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ముసురు వాతావరణం, సాధారణ వానల నడుమ విఘ్ననాయకుని ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. వాడ,వాడల్లో వినాయకస్వామి వివిధ రూపాల్లో కొలువై భక్తులకు అలౌకికానందాన్ని పంచాడు. ఒక్కో నగరంలో ఒక్కో రీతిలో వినాయకుడు విగ్రహాలను ఉత్సవ పందిళ్ళల్లో నిర్వాహకులు ఏర్పాటు చేసారు. ఈ ఏడాది అనేకచోట్ల పర్యావరణ హితాన్ని ఆకాంక్షిస్తూ మట్టి వినాయకులనే ఎక్కువ పందిళ్ళ ప్రతిష్టించారు. ఇళ్ళలో పూజించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి వినాయకులను పంపిణీచేసాయి. విజయవాడలో డూండీ గణేశ్ సేవాసమితి ఆధ్వర్యంలో కొలువైన పంచముఖ వరసిద్ధి మహాగణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. 72 అడుగుల ఎత్తుతో ఓ వైపున లక్ష్మీనరసింహస్వామి, బాలాత్రిపుర సుందరిదేవి విగ్రహాలతో ఆకట్టుకుంటోంది. ఆసీనులైన స్థితిలో అత్యంత ఎత్తైన విగ్రహంగా కొలువుదీరింది. అదేవిధంగా నగరంలో అందరి దృష్టినీ ఓ గణపతి ప్రతిమ ఆకర్షిస్తోంది. అదే చాక్లెట్ వినాయకుడు. వివిధ రకాల చాక్లెట్లను ఉపయోగించి దీనిని రూపొందించారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కడపలో వడ్లతో ఏర్పాటు చేసిన గణపయ్య ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఊరగాయల వీధిలో ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా తయారు చేసిన గణపతులను ఏర్పాటు చేయటం ఆనవాయితీగా వస్తోంది. వడ్ల వినాయకుడి కోసం 12 కట్టల వెదురు, రెండు వందల కిలోల పేపర్, 250 కిలోల వడ్లు వినియోగించారు. దీనిని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ప్రతికూల పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవాలని నంద్యాల జిల్లా బాలాజీ కాంప్లెక్స్ కశెట్టి వెంకట సుబ్బమ్మ బాలాజీ మర్చంట్ కళ్యాణ మండపంలో మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, విశ్వ సంరక్షక మహా గణపతి మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొన్నేళ్లుగా విభిన్న స్వరూపుడిని పలు రూపాల్లో తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈసారి ఎల్ నినో కారణంగా వానలు లేక ఇబ్బందులు ఉన్నాయని దేశ సంరక్షణ తదితర అంశాలను ఆకాంక్షిస్తూ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు బాలాజీ మర్చంట్ కమిటీ సభ్యులు తెలిపారు. మొసలి వాహనంపై గణనాథుడి విగ్రహాన్ని ఉంచారు. విగ్రహం ఎదుట చిన్న నీటి తొట్టి ఏర్పాటు చేసి అందులో తాబేలు, చేపలను వదిలారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నంద్యాలలో ఆంవేల వెలగ పండ్లతో గణపయ్య ప్రతిమను తీర్చిదిద్దారు. గుంటూరులోని ఏటీ అగ్రహారంలో వన వినాయకుడు భక్తుల్ని, నగరవాసుల్ని ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాడు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో రెండు టన్నుల బెల్లంతో 12 అడుగుల ఎత్తులో గణేశుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద నందీశ్వర నారికేళ గణపతి కొలువుదీరాడు. 9999 కొబ్బరి బోండాలతో రూపొందించిన వినాయకుడు ఎడ్లబండిపై వెళ్తున్నట్లు ప్రతిష్ఠించారు. ఆర్యాపురంలో త్రినేత్రుడి రూపంలో, తలపై కపాలాలతో కూడిన విగ్రహాన్ని, లక్ష్మీవారపుపేటలో వనమూలికలతో వినాయక ప్రతిమలను తీర్చిదిద్దారు. తిరుపతి నగరవ్యాప్తంగా పలుచోట్ల వినూత్నంగా ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. తుమ్మలగుంటలో విభూతి వినాయకుడు, డీఆర్ మహల్ వద్ద ఆధార్ వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దొడ్డాపురం వీధిలో డాలర్ గణేశుడు, నక్షత్ర గణనాథుడి విగ్రహాలను చూసేందుకు భక్తులు పోటెత్తారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో వినాయక చవితి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రావులపాలెం ఆత్రేయపురం ఆలమూరు కొత్తపేట మండలాల్లో యువత ఉత్సాహంగా ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను పెట్టి వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. గణేశుని ఆలయాలు అందంగా అలంకరించి విఘ్నేశుడికి రకరకాల పిండివంటలతో తయారు చేసిన నోరూరించే నైవేద్యాలను సమర్పించారు. మార్కాపురం, బాపట్ల, కడప, నెల్లూరు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో లంబోదరుడి మండపాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆకాంక్షించారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించి పర్యావరణహితమైన వినాయక చవితిని జరుపుకోవాలని ప్రజలకు సూచించారు అనకాపల్లిలో ప్రసిద్ధి చెందిన చింతామణి గణపతి దత్త క్షేత్రంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 16వేల మెక్కలతో తయారుచేసిన వినాయక ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పర్యావరణపై అవగాహన కల్పించేలా సుమారు 60వేల మెక్కలతో గణ పతి దత్త క్షేత్రంలో అలంకరణ చేశారు.

**వినాయక చవితి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాసంలో పూజలు**

వినాయక చవితి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి విఘ్నేశ్వరుడికి పూజలు నిర్వహించారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రతి ఇంట్లోనూ సుఖసంతోషాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని, అలాగే రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్న ఆటంకాలన్నీ తొలగిపోవాలని ఆయన ఆకాంక్షించారు.

### లైంగిక నేరాలకు పాల్పడే వారిపై
## సెక్సువల్ అఫెండర్ షీట్లు

**అమరావతి,సెప్టెంబరు 15,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళలు, చిన్నారుల జరుగుతున్న లైంగిక నేరాలను నియంత్రించేందుకు రాష్ట్ర పోలీసు విభాగం కీలక కార్యచరణ చేపట్టింది. ఈ తరహా నియంత్రణకు ప్రత్యేక నిఘా పెడుతోంది. ఇలాంటి కేసుల్లో శిక్షలు పడినవారు, నిందితులపై లైంగిక నేరగాళ్ల షీట్లు (సెక్సువల్ అఫెండర్ షీట్లు) తెరుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకూ 3,207 మందిపై ఈ షీట్లు తెరిచారు. 2012 నుంచి 2024 వరకూ 12 ఏళ్లలో 2,589 మందిపై ఈ షీట్లు తెరవగా 27 నెలల్లోనే అంతకంటే ఎక్కువ మందిపై ఈ షీట్లు నమోదుచేశారు. సెక్సువల్ అఫెండర్స్ షీట్లు ఉన్న వారి నివాస ప్రాంతాల్లోనూ వారి ప్రవర్తన తీరుపై పోలీసుస్టేషన్ల స్థాయిలో నిఘా పెడుతున్నారు. సెక్సువల్ అఫెండర్ షీట్లు ఉన్న వారిపై గతంలో నమోదైన కేసుల్లో విచారణ పెండింగ్‌లో ఉంటే వాటిని తిరిగి పరిశీలిస్తున్నారు.. ఎక్కడ ఆగిందో గుర్తించి ఆయా కేసుల్లో శిక్షలు పడేలా చూస్తున్నారు. తరచు లైంగిక నేరాలకు పాల్పడేవారిపై గతంలో రౌడీషీట్లు తెరిచేవారు. అటువంటి పరిస్థితుల్లో వారిపై లైంగిక నేరాల కోణంలో ప్రత్యేక నిఘా పెట్టేందుకు అవకాశం ఉండేది కాదు. సెక్సువల్ అఫెండర్స్ షీట్లు తెరిచి ఇప్పుడు వారి కదలికలను నిరంతరం ట్రాక్ చేస్తున్నారు. జియోట్యాగింగ్, డిజిటల్ మానిటరింగ్ లాంటి వ్యవస్థలను వాడుతున్నారు. మరోవైపు సెక్సువల్ అఫెండర్స్ షీట్లు ఉన్నవారి తాజా చిత్రాలతో డేటాబేస్ సిద్ధం చేశారు. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌తో కూడిన కెమెరాలకు వాటిని అనుసంధానించారు. వాళ్లెక్కడైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసు కంట్రోల్ రూమ్‌లో అప్రమత్తత సందేశం వచ్చేలా, సత్వరమే స్థానిక పోలీసులు స్పందించేలా వ్యవస్థ అమలు చేస్తున్నారు. అందుబాటులో ఉన్న సమాచారాన్ని అనుసరించి రాష్ట్రవ్యాప్తంగా 5,796 మందిపై ఈ షీట్లున్నాయి. శిక్షలు పడినవారు, నిందితుల పేరు, చిరునామా, ఫోన్ నంబర్, ఫొటో, గతంలో వారిపై నమోదైన లైంగిక నేరాల కేసులు, ఏయే పోలీసుస్టేషన్ల పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి? ఆయా కేసుల ప్రస్తుత స్థితి, బెయిల్‌పై ఉన్నారా, జైల్లో ఉన్నారా తదితర వివరాలన్నింటినీ వీటిలో పొందుపరుస్తున్నారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

• ప్రధాని జన్మదిన వేడుకలను భారీ ఎత్తున నిర్వహించాలి: రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** ఈ నెల 17న భారత ప్రదాని నరేంద్రమోదీ జన్మదినవేడుకలను రాష్ట్ర చరిత్రలో లేని విధంగా బిజెపి కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు నిర్వహించాలని రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ పిలుపు నిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'సేవా సంకల్ప అభియాన్‌ను విజయవంతం చేయుటకు ప్రతి కార్యకర్త తమ ఇంటి కార్యక్రమంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ప్రధాన జన్మదిన వేడుకలతో పుణ్యక్షేత్రం దద్దరిల్లాల్లన్నారు. ప్రదాని 25 ఏళ్ళ ప్రజా సేవను అత్యంత సమర్థవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 17 వంకు దేశ వ్యాప్తంగా 'సేవా సంకల్ప అభిమాన్‌ను' నిర్వహించుటకు పార్టీ సన్నద్ధం అవుతున్నట్లు కోలా ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాలకు తనను కో కన్వీనర్‌గా నియమించటం అభినందనీయం అన్నారు. గుజరాత్‌ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు దేశ ప్రధానిగా 12 సంవత్సరాలుగా విజవంతంగా సమర్థవంతంగా దేశాన్ని అభివృద్ధి దిశగా సాగించటం పరిపాలనా దక్షతకు నిదర్శనం అన్నారు. ఆయన జన్మదిన సందర్భంగా భారీ ఎత్తున రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు చిత్రలేఖనం, పలు సేవా పోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇంటింటికి 'నరేంద్రమోదీ సంక్షేమ పథకాల వివరాలను' ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షుడు కూనాటి నాగరాజు, వన్నెకుల క్షత్రియ రాష్ట్ర డైరెక్టర్ జి.పాళెం తేజోవతి పార్టీ మండల అధ్యక్షులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## గన్నవరంలో గంజాయి పట్టివేత

**గన్నవరం(కృష్ణా), సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** గన్నవరం సమీపంలో గంజాయి తరలిస్తున్న ఓవ్యక్తిని పోలీసులు అరెస్ట్‌చేసి 15కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఇన్‌చార్జ్ డీఎస్పీ ధర్మేంద్ర గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మీడియాకు వివరించారు. డీఎస్పీ కథనం ప్రకారం పల్నాడు జిల్లా కారంపూడి గ్రామానికి చెందిన కుంచపు సురేష్ (25) గంజాయిని తరలిస్తు విజయావాడ పశ్చిమబైపాస్ బిబి.గూడెం గ్రామం అండర్‌పాస్ వద్ద వాహనం మారే క్రమంలో పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని విచారించగా ఇతగాడు గంతంలో గంజాయి కేసుల్లో పాతముద్దాయిగా నిర్ధారించారు. ప్రస్తుతం బెయిల్‌పై తిరుగుతూ ఒడిస్సాకు చెందిన వెంకట్ సహాయంతో ఒడిస్సాలో గంజాయిని కొనుగోలు చేసి పల్నాడు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా గన్నవరం సబ్‌డివిజన్ పరిధిలో గతంలో 38గంజాయి కేసులు నమోదు చేసి 622కేజీలు గంజాయి పట్టుకుని 142 మందిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి వినియోగం, రవాణా చేస్తున్నవారి వివరాలను పోలీసులకు తెలియచేయాలని డీఎస్పీ కోరారు. ఈకార్యక్రమంలో గన్నవరం సిఐ శివప్రసాద్, ఎస్సై శ్రీధర్ సిబ్బంది పాల్గొన్నారు.

## మోక్షగుండం సేవలు ఆదర్శనీయం

• ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** సమాజాభివృద్ధికి మోక్షగుండం విశ్వేశ్వరాయ సేవలు ఆదర్శనీయమని ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో,ఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేషన్ అతిథి గృహ ప్రాంగణంలో మంగళవారం మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై మోక్షగుండం విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఇంజనీరుగా భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరాయ అనేక నిర్మాణాత్మక పనులను చేపట్టి ప్రజల మదిలో శాశ్వతంగా నిలిచారన్నారు. ఆయన నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తూ సమాజాభివృద్ధిలో మరపురాని పాత్రను పోషించారన్నారు. సంస్థ డైరెక్టర్లు కే. గురవయ్య, పి. అయూబ్ ఖాన్ మోక్షగుండం విశ్వేశ్వరాయ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా రూపొందించిన బిల్డర్స్ ఆఫ్ భారత్, ఇంజనీర్స్ సేఫ్టీ ఇండియాస్ డెస్టినీ పుస్తకాన్ని సిఎండి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు జే. రమణా దేవి, ఆర్. పద్మ, ఎన్. శోభా వాలెంటీనా, ఎం. మురళి కుమార్, సిహెచ్ రామచంద్రరావు, ఎస్. రమణ, ఎం. శ్రీకాంత్, ఏ. శ్రీనివాస బాబు, జనరల్ మేనేజర్లు సుబ్బారావు, రాజశేఖర్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్లు చంద్రశేఖర రావు, హేమ లత, తిరుమలరావు, రవికుమార్, ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులు పి. బాలాజీ, వి. రమేష్ బాబు, కే. జయప్రకాష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సత్వరం కృషి

• ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్‌లోతేటి



**తిరుపతి,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిఎస్పీడిసిఎల్ పరిధిలోని తొమ్మిదిజిల్లాల్లో ఉన్న వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఓల్టేజ్ లో హెచ్చుతగ్గులు, గృహాలపై వెళుతున్న విద్యుత్ లైన్ల మార్పు తదితర సమస్యలను వినియోగదారులు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారానే గాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912 గానీ 1800 425 155333కు కాల్ చేయడం వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఎస్పీడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి, ఫైనాన్స్ /ఎఫ్ఎసి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఎన్. శోభా వాలెంటీనా, ఆర్. పద్మ, ఎం. మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, ఎం. శ్రీకాంత్, ఏ. శ్రీనివాస బాబు, జనరల్ మేనేజర్లు జగదీష్, భాస్కర్ రెడ్డి, హేమలత, సురేష్,పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

• వేద పండితుల వసతులకు తగిన చర్యలు: మంత్రి కందుల దుర్గేష్ • ఎంపికైన నిత్య వేద పారాయణదారులకు నియామక పత్రాలు అందజేత • ఆలయాల పునరుద్ధరణకు ప్రాధాన్యత • పుష్కరాల వేళ 80 గ్రామాల పురోహితులకు వసతి, షెడ్లు





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు15,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన వేద పండితులకు తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు లోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ నియామక పత్రాలను అందజేశారు. టిటిడి నిర్వహించిన వేద పారాయణ స్కీమ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 741 మంది వేద పండితులను ఎంపిక చేయగా.. నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాలకు చెందిన కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేద నిష్ణాతులైన 10 మంది పండితులు ఈ నియామక పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని అన్నారు. నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటికే అనేక పురాతన ఆలయాల నిర్మాణానికి, పునరుద్ధరణకు భారీగా నిధులు మంజూరు చేశామని గుర్తుచేశారు. పుష్కరాల సందర్భంగా పురోహితులకు అవసరమైన వసతి షెడ్ల ఏర్పాటుపై సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రి కందుల దుర్గేష్ కి వేదాశీర్వచనం అందించి ఘనంగా సత్కరించారు. కూటమి ప్రభుత్వం పురోహిత, అర్చక, దేవాలయ వ్యవస్థల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పండితులు పేర్కొన్నారు. ఇటీవల టిటిడి ద్వారా రూ.791 కోట్ల వ్యయంతో నియోజకవర్గం లోని వేద విద్యార్థులు, పండితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యంత పారదర్శకంగా పోస్టులను భర్తీ చేయడం అభినందనీయమని వారు కొనియాడారు. అందుకు మంత్రి కందుల దుర్గేష్ కు, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 2027 జూన్ 26 నుండి ప్రారంభమయ్యే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుండటంపై వేద పండితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఉండ్రాజవరం పరిధిలోని తీపర్రు వద్ద పుష్కర ఘాట్లు ఏర్పాటు చేస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పుష్కరాల సమయంలో విచ్చేసే లక్షలాది మంది భక్తులకు పూజా కార్యక్రమాలు, పిండ ప్రదానాలు నిర్వహించేందుకు నిడదవోలు పరిసర ప్రాంతాలలోని 80 గ్రామాల పురోహితులకు తగిన వసతి మరియు ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయాలని పండితులు మంత్రి దుర్గేష్ కు వారు విన్నవించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్‌ల నాయకత్వంలో ప్రజలకు సుభిక్షమైన, పారదర్శకమైన పరిపాలన అందుతోందని ఈ సందర్భంగా వేద పండితులు సంతోషం వ్యక్తం చేశారు.



## ఇన్‌కాయిస్ ప్రాంతీయ కేంద్రానికి భూమి గుర్తింపు...

• ఎంపి సతీష్ బాబుకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లేఖ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 15,(ప్రభాతవార్త):** కాకినాడలో ఇన్‌కాయిస్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయాలన్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ప్రతిపాదన కార్యరూపం దిశగా ముందుకు సాగుతోంది. కేంద్రం ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించి, తదుపరి అనుమతుల కోసం ప్రతిపాదనను ఐ అండ్ ఐ శాఖకు పంపినట్లు కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఎంపీకి రాసిన లేఖలో వెల్లడించారు. కాకినాడలో ఇన్‌కాయిస్ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీ సానా సతీష్ బాబు ఈఏడాది జూలై 21న ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు.

# కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

• స్థానిక సంస్థల ఎన్నికలపై ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్



**తిరుపతి,సెప్టెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లాల్లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ నిర్దేశం చేశారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎక్కడా లోపం లేకుండా సమన్వయంతో కలసి పనిచేయాలని, అభ్యర్థుల ఎంపిక, గెలుపు ప్రధానంగా ఉండాలన్నారు. ప్రజల్లోనే ఉండి ప్రజలకోసం పనిచేసే వారికి టిక్కెట్లు ఇవ్వడం వల్ల పార్టీ బలోపేతం కావడమేగాక ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారమో ధ్యేయంగా పనిచేస్తారన్నారు. కూటమిలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని మంత్రి అనగాని హితవు చేశారు. తిరుపతిలో మంగళవారం మధ్యాహ్నం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నేతలతో తిరుపతి పార్లమెంట్ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే, జనసేన ఎన్నికల పరిశీలకుడు పత్సమట్ల ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జెబి శ్రీనివాస్, కిరణ్‌రాయల్, నరసింహాచారి, నరేంద్రతో కలిసి కీలకంగా చర్చించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి పనిచేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. రాబోయే మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీల ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య సమన్వయం, స్థానిక పరిస్థితులు, ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. ఆయా ప్రాంతాల్లో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేసేలా తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల సన్నద్ధతను మరింత పటిష్టం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై సమావేశంలో అభిప్రాయాలు పంచుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,బిజెపి నాయకత్వం అందిస్తున్న మార్గదర్శకత్వంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు మెలగాలన్నారు. ఈ సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు కిరణ్ రాయల్, పి.కీర్తన, బి.విజయకుమార్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## చిరుతల దాడిలో ఏడు జింకల మృతి



**అనంతపురం రూరల్, సెప్టెంబర్ 15 ప్రభాతవార్త :** అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామంలో చిరుతల దాడీ చేయడం తో 7 జింకలు మృతి చెందాయి. చిరుతల దాడిలో జింకాలు మృతి చెందిన విషయం ను రైతులు,గ్రామ ప్రజలు ఫారెస్ట్ అధికారులకు తెలియజేయడంతో ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకొని మృతి చెందిన జింకలను పరిశీలించి చిరుతలు దాడి చేయడం వల్లనే జింకలు మృతి చెందాయని ఫారెస్ట్ అధికారులు, పోలీసుల అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి గ్రామంలోని రైతు భాస్కర్‌రెడ్డికి చెందిన టమోటా తోటల్లో జింకలు మృతి చెంది ఉండాడాని రైతులు చూసి మాకు తెలియజేయడంతో మేము గ్రామంలో కి వెళ్లి మృతి చెందిన జింకలను పరిశీలించి వాటి నమూనాలు సేకరించి, అనంతరం మృతి చెందిన జింకలను కాల్చి వేయడం జరిగిందన్నారు. సేకరించిన నమూనాలను ల్యాబ్ కు పంపడం జరిగిందన్నారు. జింకలు ఏ విధంగా చనిపోయాయని కారణాలు ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాతే తెలుస్తాయన్నారు. అయితే గ్రామంలోని ప్రజలు రైతులు పొలాల్లో అప్పుడప్పుడు చిరుతలు కనిపిస్తాయని తెలియజేశారన్నారు. చిరుతల సంచారంతో తాటిచెర్ల గ్రామ పరిసర ప్రాంతాల రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

